ప్రజాశక్తి
శుక్రవారం 26 ఏప్రిల్ 2024
I
అల్లూరి సీతారామరాజు

ఆసుపత్రిలో నీటి సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో నీటి సౌకర్యం తక్షణమే ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కారం చేయాలని ఐద్వా మండల అధ్యక్షురాలు ఈశ్వరి డిమాండ్ చేశారు. ఆమె ఆసుపత్రిలో రోగులు, బాలింతల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డులో ఉన్న రోగులు, బాలింతలు మాట్లాడుతూ, కాలకృత్యాలు తీర్చుకునేందుకు రన్నింగ్ వాటర్ రాలేదన్నారు. సుమారు రెండు వారాలుగా చాలీచాలని నీటితో అవస్థలు పడుతున్నామన్నారు. రోగులు బయటకు వెళ్లి స్నానం చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఈ విషయం పై ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అభిషేక్, వైద్య శాఖ అధికారులు తక్షణమే స్పందించి నీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

వార్డును పరిశీలిస్తున్న ఈశ్వరి

పోలవరం నిర్వాసితులను నట్టేట ముంచిన టిడిపి, వైసిపి

- నిధులివ్వకుండా ద్రోహం చేసిన బిజెపి
- కంటితుడుపుగా పునరావాసం, పరిహారం
- 'పోలవరం పోరుకేక'తో నిర్వాసితులకు అండగా నిలిచిన సిపిఎం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములు, గ్రామాలను త్యాగం చేసిన నిర్వాసితులను ఈ పదేళ్లలో టిడిపి, వైసిపి ప్రభుత్వాలు నట్టేటముంచాయి. ప్రాజెక్టు నిర్మాణంపైనే శ్రద్ధ పెట్టాయి తప్ప, నిర్వాసితులకు పరిహారం, పునరావాసాన్ని ఏ మాత్రం పట్టించుకోలేదు. మరో వైపు జాతీయ ప్రాజెక్టుగా గుర్తింపు పొందిన దీనికి పూర్తిగా నిధులు ఇవ్వాల్సిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆర్ అండ్ ఆర్‌కు ఒక్క పైసా కూడా ఇవ్వకుండా నిర్వాసితులకు ద్రోహం చేసింది. దీంతో పోలవరం ప్రాజెక్టు తమ పాలిట శాపంగా మారిందని ముంపు మండలాల్లోని గిరిజనులు, గిరిజనేతర ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పోలవరం ప్రాజెక్టుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2004లో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రూ.8,261 కోట్ల అంచనా వ్యయంతో శంకుస్థాపన చేశారు. రాష్ట్ర విభజన సమయంలో ఈ ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి నిర్మాణం, పునరావాసానికి అయ్యే మొత్తం ఖర్చు కేంద్ర ప్రభుత్వం భరిస్తుందని విభజన చట్టంలో పొందిపరిచారు.

నేటికీ 11 శాతమే పునరావాసం

కాంటూరు లెక్కల ప్రకారం 41.5, 45.05, 47.02 అడుగుల ఎత్తు పేరుతో మూడు విభాగాలుగా భూసేకరణ చేస్తామని ప్రకటించారు. ఈ ప్రాజెక్టు కోసం 1,67,765 ఎకరాల భూమి అవసరమని అధికారులు లెక్కతేల్చారు. దాదాపు రెండు దశాబ్దాల్లో 1,13,119 ఎకరాలు సేకరించారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో 1.06 లక్షల కుటుంబాలను నిర్వాసిత జాబితాలోకి తెచ్చారు. కాని ఇప్పటికీ కేవలం 11,677 మందికి మాత్రమే పునరవాసం కల్పించారు. ఈ గణాంకాల ప్రకారం కేవలం 11 శాతం మందికే పునరవాసం కల్పించినట్లు స్పష్టమవుతోంది. ప్రాజెక్టు పనులు ప్రారంభించి 19 ఏళ్లు దాటినా, జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి 10 ఏళ్లు కావస్తున్నా ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చిన నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ 11 శాతమే ఇవ్వడంతో వారంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గడిచిన పదేళ్లలో టిడిపి, వైసిపి పాలకులు ప్రాజెక్టు పూర్తి చేసేది తామేనంటూ ఎవరికి వారు ప్రకటనలు గుప్పిస్తున్నారు తప్ప నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ విషయాన్ని పట్టించుకోవడం లేదు.

నాణ్యతపై నీలినీడలు

ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి గైండ్ బండ్ కుంగిపోవటంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది. పోలవరం నిర్మాణం పూర్తి సంగతి ఎలా ఉన్నా నాణ్యతపైనే నీలి నీడలు కమ్ముకున్నాయి. అయితే ప్రాజెక్టు నిర్మాణ సంస్థ నుంచి బిజెపి, వైసిపి, టిడిపిలు ఎలక్టోరల్ బాండ్ల రూపంలో రూ.1000 కోట్లు లబ్ధి పొందిన ఉదంతం ప్రజలను ఆలోచింపజేస్తుంది.

రెండేళ్ల క్రితం వి.ఆర్.పురం నుంచి సురక్షిత ప్రాంతానికి పడవపై సామాన్లుతో తరలివెళ్తున్న ముంపు బాధితులు (ఫైల్‌ఫోటో)

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు నాయకత్వంలో జరుగుతున్న పోరుకేక పాదయాత్ర (ఫైల్‌ఫోటో)

హామీలను తుంగలో తొక్కిన టిడిపి, వైసిపి

ప్రపంచంలో ఒక్కడైనా ప్రాజెక్టులు, పరిశ్రమలు నిర్మాణం చేసేటప్పుడు అందుకు భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు పరిహారం, పునరావాసం పూర్తి చేసిన తరువాతే నిర్మాణం చేపట్టాలి. ఇది సహజ న్యాయం. కాని పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల విషయంలో ఆ న్యాయాన్ని ఏ ప్రభుత్వం పాటించలేదు. రాష్ట్ర విభజన అనంతరం 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి చంద్రబాబు ప్రభుత్వం నిర్వాసితులకు పరిహారం, పునరావాసం గురించి పట్టించుకోకుండా నిర్మాణంపైనే శ్రద్ధ వహించింది. దీంతో 2019 ఎన్నికలకు ముందు నిర్వహించిన పాదయాత్రలో భాగంగా ఈ ప్రాంతానికి ప్రతిపక్ష నేతగా వచ్చిన వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి నిర్వాసితులకు వరాల జల్లు కురిపించారు. గతంలో ఎకరాకు రూ.1.25 లక్షలు, రూ.1.40లక్షలు, రూ.1.50 లక్షలు చొప్పున భూ పరిహారం పొందిన వారికి అన్యాయం జరిగిందని, వారికి అదనంగా మరో రూ.5 లక్షలు సాయం అందిస్తామని చెప్పారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ రూ.6.30 లక్షలకు బదులుగా రూ.10 లక్షల చొప్పున అందిస్తామని తెలిపారు. గ్రామాలు ఖాళీ చేసే నాటికి 18 సంవత్సరాలు వయసు ఉన్న ప్రతి ఒక్కరికీ ప్యాకేజీ ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆయన మాటలు నమ్మి వైసిపికి నిర్వాసితులు బ్రహ్మరథం పట్టారు. కాని గడిచిన ఐదేళ్లలో ఈ హామీల్లో ఏ ఒక్కటీ అమలుకు నోచుకోలేదు. అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిదశ 41.05 కాంటూరు పరిధిలోని సుమారు 20 వేల కుటుంబాల వరకే తన బాధ్యత అంటూ మాటమార్చారు.

పాలనా యంత్రాంగం, దళారుల మోసం

నిర్వాసితులను ఓ వైపు పాలనాయంత్రాంగం, మరో వైపు దళారులు మోసం చేశారు. ఆర్థికంగా కుదేలు చేశారు. జాబితాల పేరుతో జరిగిన కాలయాపనతో దళారుల జోక్యం పెరిగింది. దేవిపట్నంలో మండల రెవెన్యూ అధికారిపైనే అనేక ఆరోపణలు వెలుగులోకి రావటం చర్చనీయాంశమైంది. దళారులతో ఇబ్బందులు పాలవుతున్నా, అధికారుల నిర్లక్ష్యంతో తంటాలు పడుతున్నా గత పదేళ్లలో టిడిపి, వైసిపి ప్రభుత్వాలు నిర్వాసితులపై కనీస కనికరం చూపలేదు.

ద్రోహం చేసిన బిజెపిలో పొత్తు, తొత్తు

పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించినప్పటికీ నిర్మాణ బాధ్యతే తమదని, నిర్వాసితుల పరిహారం, పునరావాసం తమకు సంబంధం లేదని బిజెపి మాట మార్చింది. అయినా కేంద్ర మోడీ ప్రభుత్వాన్ని నిలదీయటంలోనూ, ప్రాజెక్టుకు పూర్తిస్థాయి నిధులు సాధించటంలోనూ టిడిపి, వైసిపి మెతక వైఖరి అవలంభించాయి. మూడు పార్టీలు పోలవరం ప్రాజెక్టును ఎటిఎంలా వాడుకున్నాయనేది సుస్పష్టం. ప్రాజెక్టు నిర్మాణంతో పాటు, నిర్మాణంకోసం భూములు, గ్రామాలను త్యాగం చేసిన నిర్వాసితుల గోడు పట్టించుకోని బిజెపితో ప్రత్యక్షంగా తెలుగుదేశం, పరోక్షంగా వైసిపి జతకట్టి 2024 ఎన్నికలలో ఓటర్లను మభ్యపెట్టేందుకు మరోసారి సిద్ధమయ్యాయి.

పోలవరం నిర్వాసితుల కోసం సిపిఎం పోరుకేక

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివసరావు సారధ్యంలో పోలవరం నిర్వాసితుల కోసం సిపిఎం చేపట్టిన 'పోలవరం పోరుకేక' గత ఏడాది విజయవంతంగా సాగింది. ముంపు మండలాలలో సుమారు 400 కిలో మీటర్ల పాదయాత్ర చేపట్టి విజయవాడకు వేలాది సంఖ్యలో ముంపు మండలాల ప్రజలు చేరుకుని ప్రభుత్వానికి తమ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఢిల్లీలోనూ ఆందోళన చేపట్టి పోలవరం నిర్వాసితులకు సిపిఎం అండగా నిలిచింది. తాజాగా ఆ పార్టీ నుంచి రంపచోడవరం అసెంబ్లీ అభ్యర్థిగా లోతా రామారావు, అరకు పార్లమెంటు అభ్యర్థిగా పాచిపెంట అప్పలనర్స బరిలో నిలిచారు. పోరాట చరిత్ర కల్గిన తమను గెలిపిస్తే పోలవరం నిర్వాసితులకు అండగా నిలుస్తామని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

పిచికారీని పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి ప్రసాద్

దోమల మందును పిచికారీ చేయించుకోవాలి

ప్రజాశక్తి పాడేరు :- దోమల నివారణకు ఏసీఎం 5శాతం మందును తప్పనిసరిగా ప్రతి ఇంటిలో పిచికారీ చేయించుకోవాలని జిల్లా మలేరియా అధికారి పిఎస్ ఎస్ ప్రసాద్ సూచించారు. మండలంలోని చింతలవీధి ఆరోగ్య ఉప కేంద్రం తలారి సింగి గ్రామంలో జరుగుతున్న ఏసీఎం 5శాతం మందు పిచికారిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంటి లోపల, దోమల ఉన్న చోట్ల పిచికారి చేయించుకోవాలని సూచించారు. వారానికి ఒకసారి ఫ్రైడే డ్రైడే చేస్తూ మంచినీటి పాత్రలన్నీ కూడా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీరు నిలవ లేకుండా చూసుకోవాలన్నారు. దోమలను తొలిదశలోనే నివారిస్తే మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధుల నుండి రక్షించు కోగలమని తెలిపారు. పిచికారిపై గ్రామాలకు వెళ్లే ముందు సమాచారం ఇవ్వాలని, ప్రజలకు ఉన్న అనుమానాలను తొలగించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ డి.శేషగిరి, ఎస్ ఓ ధనుంజయ్, హెల్త్ అసిస్టెంట్ శెట్టి నాగరాజు, కృష్ణ వేణి, ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-చింతపల్లి: మానసిక ఉల్లాసానికి, శారీరక దారుడ్యానికి క్రీడలు ఎంతగానో దోహద పడతాయని ఎంపీపీ కోరాబు అనూష దేవి తెలిపారు. స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత తో కలిసి ఆమె గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ద యూనిటీ కప్ సెకండ్ సిరీస్ హార్డ్ టెన్నిస్ బాల్ సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్‌ను లాంఛనంగా ప్రారంభించారు.

టోర్నీని ప్రారంభిస్తున్న ఎంపిపి, సర్పంచ్

అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ,ఈ టోర్నమెంట్ లో ప్రధమ విజేతకు 50 వేలు, ద్వితీయ 20 వేల నగదు బహుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు.ఈ టోర్నమెంట్ నిర్వహణకు ఎంపీపీ అనూష దేవి 20వేలు, సర్పంచ్ పుష్పలత, హేమంత్ దంపతులు పది వేలు, స్థానిక ఇంజనీరింగ్ జేఈలు (జ్యోతి బాబు, లోకేష్ లు) 20వేలు, ప్రసాద్, నాగేంద్రలు సంయుక్తంగా పదివేలు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు మోరి రవి, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం విజయభారతి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస పాత్రుడు పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలోని టోకురు పంచాయతీ టోకురు గ్రామంలో సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్‌ను సిపిఎం సర్పంచ్ కె.మొస్య ప్రారంభించారు. యువతీ యువకులు ఆటలపై దృష్టి సారించాలన్నారు.ఈ కార్యక్రమంలో నిర్వాహకులు అభినవ్ శేఖర్, సునీల్, లక్ష్మణ్, రాజకుమార్ పాల్గొన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో ఐటిడిఏ పిఒ చైతన్య తదితరులు

ముగ్గురు విద్యార్థులకు నగదు బహుమతులు

ప్రజాశక్తి-చింతూరు

10వ తరగతి పరీక్షా ఫలితాల్లో డివిజన్ పరిధిలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు చింతూరు ఐటిడిఏ పిఒ కావూరి చైతన్య గురువారం నగదు బహుమతులు అందజేశారు. డివిజన్ పరిధిలో 570 మార్కులతో ప్రథమ స్థానం సాధించిన చింతూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి వేలు వసుంధరకు రూ.7 వేలు, 560 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచిన నరసింహపురం హైస్కూల్ విద్యార్థి పి.నవ్యకు రూ.6వేలు, 559 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచిన కూనవరం బాలికల గురుకుల పాఠశాల విద్యార్థి బి.హర్షితకు రూ.5 వేలు నగదు బహుమతి అందించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లడుతూ భవిష్యత్తులో మరిన్ని మార్కులు సాధించి విద్యార్థులు రాణించాలని ఆకాంక్షించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఎంఇఒ లక్ష్మీనారాయణ, ఎపిఓ సుజాత, భద్రయ్య అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -సీలేరు

ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా జికె.వీధి మండలం సీలేరు పిహెచ్‌సి వైద్యాధికారి మస్తాన్ వల్లి ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. మలేరియా అంతం.. మన పంతం, దోమ చిన్నది.. ప్రమాదం పెద్దది, వేపాకు పొగ.. దోమలకు సెగ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అనంతరం వైద్యాధికారి ఖాదర్ మస్తాన్ వల్లి మాట్లాడుతూ దోమలను నిర్మూలించడానికి ప్రతి ఒక్కరు ఫ్రైడే డ్రైడే పాటించాలని సూచించారు. నీటి నిల్వలు ఉన్న గుంతలను ఎప్పటికప్పుడు పూడ్చాలని, పాత ఫ్రిజ్‌లు, టైర్లు, ఓవర్ హెడ్ ట్యాంకులు, కూలర్లలో నీటి నిల్వలు ఉండడం వల్ల దోమలు వృద్ధి చెంది మలేరియా వ్యాప్తి చెందుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి కె.జోజిబాబు, పర్యవేక్షికులు ఎన్. త్రినాధరావు, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఎల్టి శివ, ఫార్మసిస్టు సాయికృష్ణ, స్టాఫ్‌నర్స్ దేవి, ఎం.కుమారి ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది

ముగిసిన నామినేషన్ల ఘట్టం

- చివరి రోజు 35 మంది అభ్యర్థులు దాఖలు

ప్రజాశక్తి-పాడేరు: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ఘట్టం ఈనెల 18న ప్రారంభమై 25న గురువారం ముగిసింది. పాడేరు, అరకు, రంపచోడవరం, అసెంబ్లీ స్థానాలకు పోటీ చేయదలచిన అభ్యర్థుల నుంచి పాడేరు, రంపచోడవరం నియోజకవర్గ కేంద్రాల్లో నామినేషన్లు స్వీకరించారు. అరకు అసెంబ్లీ స్థానానికి పోటీ చేసే అభ్యర్థులు పాడేరు ఐటిడిఏ కార్యాలయంలో అరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తమ నామినేషన్లను దాఖలు చేశారు.

అల్లూరి జిల్లాలో చివరి రోజు గురువారం 35 మంది అభ్యర్థులు 39 నామినేషన్లు దాఖలు చేసినట్లు జిల్లా కలెక్టర్ విజయ సునీత వెల్లడించారు. ఆఖరి రోజు గురువారం అరకు అసెంబ్లీ నియోజక వర్గానికి 12 నామినేషన్లు దాఖలయ్యాయని రిటర్నింగ్ అధికారి, ఐటిడిఏ, పి.ఓ. వి.అభిషేక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శెట్టి గంగాధర స్వామి, బిజెపి అభ్యర్థి పాంగి రాజారావు నామినేషన్లు దాఖలు చేసారు. కమ్మిడి నిర్మల రెండు సెట్లు, సమిర్ధి గులాబి వంతాల రామన్న, స్వతంత్ర అభ్యర్థులు చెండా ఏలియా, పి.రామకృష్ణ, మొస్య సుజాత, తాంగుల రామదాసు, దురియా సాయిబాబా, సమిర్ధి భవాని ఒక్కొక్క నామినేషను సమర్పించారు. ఈనెల 18వ తేదీన నామినేషన్లు దాఖలు కాలేదు. 19వ తేదీన ఆరు, 20 వతేదీన రెండు, 22 న ఐదు, 23న ఆరు, 24న 13 నామినేషన్లు, 25న 12 నామినేషన్లు దాఖలయ్యాయి.

అరకు అసెంబ్లీ స్థానానికి మొత్తం 44 నామినేషన్లు దాఖలు అయినట్లు రిటర్నింగ్ అధికారి అభిషేక్ వెల్లడించారు. సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను సాదారణ పరిశీలకులు కె.వివేకానందన్ పరిశీలించారు. అరకు అసెంబ్లీ నియోజక వర్గం నామినేషన్ ప్రక్రియను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసారు.

పాడేరు అసెంబ్లీ స్థానానికి చివరి రోజు గురువారం 13 నామినేషన్లు దాఖలు అయ్యాయి. నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సతక బుల్లిబాబు, టిడిపి అభ్యర్థి గిడ్డి ఈశ్వరి జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి సుమంతు నాగేశ్వరరావు, టిడిపి డమ్మీ అభ్యర్థి అడప కీర్తి, మన్విత ఆంధ్ర రాష్ట్ర సమితి పార్టీ అభ్యర్థి జల్లి రాజబాబు, ఇండిపెండెంట్ అభ్యర్థులు ఇల్లు వెంకట రమేష్ నాయుడు, శంకరరావు, వంతాల సుబ్బారావు ఒక్కొక్క నామినేషన్ సిగ్గె శ్రీను రెండు సెట్లు నామినేషన్లు ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎస్ జానకమ్మ, జై మహాభారత్ పార్టీ అభ్యర్థి బొంకు అర్జున్ రావు నామినేషన్లు వేశారు.

రంపచోడవరం అసెంబ్లీ స్థానానికి చివరి రోజు గురువారం 14 నామినేషన్లు దాఖలయ్యాయి సిపిఎం అభ్యర్థి లోతా రామారావు, సిపిఎం డమ్మీ అభ్యర్థి గా పూనెం సత్యనారాయణ టిడిపి అభ్యర్థి మిరియాల శిరీష దేవి రెండు సెట్లు, వైసిపి అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మి రెండు సెట్లు నామినేషన్లు వేశారు. వైసిపి డమ్మీ అభ్యర్థిగా బొడ్డపాటి రాఘవ, టిడిపి డమ్మీ అభ్యర్థిగా మిరియాల లోవలక్ష్మి నామినేషన్లు వేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థులుగా కుంజా శ్రీను, పాలడుగు శ్రీ వెంకటేశ్వరరావు, అంజిరెడ్డి దుర్గం అశోక్ కుమార్, కె వీర వెంకట సత్యనారాయణ, బంగారు వెంకటేష్ నామినేషన్లు వేశారు.

జిల్లాలో 103 నామినేషన్లు

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి జిల్లాలో చివరి రోజు గురువారం 35 మంది అభ్యర్థులు 39 నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో అరకులోయ 12, పాడేరు 13, రంపచోడవరం 14 చొప్పున నామినేషన్లు దాఖలు అయ్యాయి. జిల్లాలోని మూడు అసెంబ్లీ స్థానాలకు మొత్తం 103 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో అత్యధికంగా అరకు అసెంబ్లీ స్థానానికి 44, పాడేరు 33, రంపచోడవరంకు 26 నామినేషన్లు దాఖలు అయ్యాయి.

నామినేషన్ పత్రాన్ని సమర్పిస్తున్న బుల్లిబాబు

ఇండియా ఫోరం గెలుపుతోనే అభివృద్ధి

- కాంగ్రెస్ పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి బుల్లిబాబు

ప్రజాశక్తి పాడేరు: ఇండియా పోరం అభ్యర్థుల గెలుపుతోనే ఆదివాసీల అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ పాడేరు నియోజకవర్గం అభ్యర్థి శతక బుల్లిబాబు అన్నారు. ఈనెల 22న తన తొలి సెట్ నామినేషన్ వేసిన ఆయన తన బీఫామ్ తో రెండో సెట్ నామినేషన్‌ను సిపిఎం పాడేరు నియోజకవర్గం ఇన్చార్జి బోనంగి చిన్నయ్య పడాల్ తో కలిసి దాఖలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, దేశంలో రాష్ట్రంలో భిన్న పరిస్థితులు ఉన్నాయన్నారు. రాజ్యాంగాన్ని రక్షించే వారు ఒకవైపు ఉండగా నాశనం చేసేవారు మరోవైపు ఉన్నారని తెలిపారు. వైసీపీ, టిడిపిలకు వేసిన ప్రతి ఓటు బిజెపికి వేసినట్టేనన్నారు. ఆలోచించి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. . పాడేరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా మళ్లీ ఎగరబోతుందని ధీమా వ్యక్తం చేశారు. గిరిజనుల హక్కుల పరిరక్షణకు తాను శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. జీవో 3 పై ఉన్నత న్యాయస్థానంలో పోరాడుతూనే ప్రభుత్వం పైన ఒత్తిడి తెస్తామన్నారు.చింతపల్లి- కొయ్యూరు మధ్య చేపట్టే హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణంతో 32 గ్రామాల ప్రజలకు నష్టం ఏర్పడుతుందని, దీనిని తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సుబ్రహ్మణ్యం, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపై నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి-పాడేరు: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా పాడేరులో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సి.జమాల్ బాషా, డిఎంఓ పిఎస్ఎస్ ప్రసాద్ ప్రారంభించారు. అంబేద్కర్ సెంటర్ నుంచి ఐటిడిఏ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా డిఎం అండ్ హెచ్ ఓ మాట్లాడుతూ, ప్రపంచ మలేరియా దినోత్సవ ఆవశ్యకతను వివరించారు. ప్రజల్లో మలేరియా వ్యాధి పట్ల మరింత అవగాహన అవసరమని, ఈ సీజన్లో జ్వర బాధితులు మలేరియా పరీక్షలు చేసుకొని చికిత్సలు చేయించుకోవడంపై తగు శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ అధికారులు, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి : మలేరియా వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ విధిగా దోమతెరలను వినియోగించాలని స్థానిక ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్ సూచించారు. స్థానిక ఏరియా ఆసుపత్రి వద్ద సహాయ మలేరియా అధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఏరియా ఆసుపత్రి నుంచి అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గడిచిన రెండు రోజులుగా మన్యంలో కురుస్తున్న చిన్నపాటి వర్షాలతో జ్వరాలు ప్రభలే అవకాశాలున్నాయని తెలిపారు. చిన్నపాటి జ్వరాలపై నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకు ముప్పు వాటిల్లె ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ ఈవో జాన్సన్, మలేరియా సూపర్వైజర్ శ్రావణి సంధ్య, హెల్త్ సూపర్వైజర్ శాంత కుమారి, ఎంఎల్ హెచ్‌పి ఈ.లక్ష్మి, ఏఎన్ఎంలు కే.విజయలక్ష్మి, ఎస్.వరలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్స్ సత్యారావు, లక్ష్మణరావు, ప్రకాష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎం అండ్ హెచ్ ఓ

పేరుకుపోయిన చెత్తాచెదారం

అపారిశుధ్యంతో అవస్థలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని అంగన్ వాడి కేంద్రం ప్రహరీ పరిసరాల్లో ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లతో పాటు ఇతర చెత్త చెదారాలు పేరుకుపోయి అపారిశుధ్యంగా మారింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షపు నీరుతో చెత్తచెదారం నిల్వ ఉండి పోతుండటంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. అదే విధంగా దుర్వాసన తీవ్రంగా వెదజల్లుతుంది. దీంతో అంగన్ వాడి కేంద్రానికి వచ్చే గర్భిణీలు, చిన్నారులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కేంద్రానికి అనుకొని ఉన్న నివాస గృహాల వారు సైతం దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమలు వ్యాప్తి చెందడంతో మలేరియా, డెంగీ వంటి వ్యాధులకు గురవుతున్నామని తెలిపారు. పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు.

సిపిఎం గెలుపుతోనే గిరిజన చట్టాలు పటిష్ట అమలు

అభ్యర్థుల ప్రచార కార్యక్రమాల్లో నాయకులు

వారపు సంతలో ప్రచారం చేస్తున్న వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- యంత్రాంగం

రంపచోడవరం : గిరిజన చట్టాలు పటిష్టంగా అమలు జరగాలంటే సిపిఎం అభ్యర్థులను గెలిపించి చట్ట సభలకు పంపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. ఇండియా వేదిక బలపర్చిన రంపచోడవరం నియోజవర్గ సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావును, అరకు సిపిఎం ఎంపీ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సను గెలిపించాలని కోరుతూ మండలంలోని వాడపల్లి, చిన్న బారంగి, పెద్ద బారంగి, ముసురుమిల్లి, తాటివాడ గ్రామాల్లో గురువారం సిపిఎం బృందాలు విస్తృతంగా ప్రచారం నిర్వహించాయి. సిపిఎం గుర్తు సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ కోరారు. వాడపల్లి సంతలో ప్రజానాట్య మండలి కళాకారులు నృత్యాలు, పాటలతో ప్రజలను ఆకర్షించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సిపిఎం అభ్యర్థులను గెలిపిస్తే గిరిజన ప్రాంత అభివృద్ధి కృషి చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్ల వాణిశ్రీ, ప్రజానాట్య మండలి సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలపై పోరాడే వారికే మద్దతు

రాజవొమ్మంగి : గతంలో అనేక ప్రభుత్వాలను, ఎమ్మెల్యేలను చూశామని, ఈ సారి మార్పు జరిగితే బాగుంటుందని గిరిజనులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలపై పోరాడే వారికే మద్దతు ఇస్తామని స్పష్టం చేస్తున్నారు. మండలంలోని అమ్మిరేకుల, కొత్తవీధి, కిమ్మలిగెడ్డ తదితర గ్రామాల్లో గురువారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామసభల్లో సిపిఎం మండల నాయకులు కొండ్ల సూరిబాబు, కె.జగన్నాథం, టి.శ్రీను మాట్లాడుతూ, ఏజెన్సీలో 100 శాతం ఉద్యోగాలు గిరిజనులకే రావాలన్నా, గిరిజన ప్రాంత రహదారులు బాగుపడాలన్నా సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గతంలో టిడిపి, ఈ ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వాలు ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి చేసింది ఏమీ లేదన్నారు. అనంతరం ప్రజానాట్యమండలి కళాకారులు అయా గ్రామాల్లో పాటలు పాడుతూ కళారూపాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.రమేష్, రామరాజు, చిన్నారావు పాల్గొన్నారు.

వై.రామవరం : మండలంలోని కోట పంచాయతీ పరిధిలోని ఎర్రంపాలెం, ముసలపాలెం, బొడ్డపల్లి, గంగపల్లి, ఓడపల్లి సంత మార్కెట్లో సిపిఎం నాయకులు ప్రచారం చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.రామకృష్ణ, ఆంజనేయులు, రాజేష్, శ్రీను, శాంతి రాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దేవీపట్నం : మండలంలోని రమణయ్యపేట, భీంపల్లి, ఇందుకూరు, శరభవరం గ్రామాలలో సిపిఎం కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. సిపిఎం నాయకులు గూడెం వెంకటరావు మాట్లాడుతూ పోలవరం నిర్వసితుల సమస్యలను పరిష్కరించడంలో టిడిపి, బిజెపి, వైసిపి ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎ.శ్యామలరాణి, జి.సూర్య కిరణ్, జె.గోపి, వి.సాయిబాబు, ఎస్ సాయి, విజయలక్ష్మి, బుల్లెమ్మ తదితరులు పాల్గొన్నారు.

మోతుగూడెం : చింతూరు మండలం లక్కవరం గ్రామంలో సిపిఎం నాయకులు ఇంటింటికి కరపత్రం పంపిణీ చేసి ఓట్లు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పల్లపు వెంకట్, మండల కమిటీ సభ్యులు మడకం చిన్నయ్య, కారం సుబ్బరావు, పూసం వీరయ్య, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల : మండలంలోని డి.చోడవరం గ్రామంలో సిపిఎం నాయకులు ఉపాధి హామీ కూలీలతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు.

అమ్మిరేకులలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

గిరిజన ప్రాంతం అభివృద్ధికి సిపిఎం అభ్యర్థులను చట్ట సభలకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర నాయకులు ఏవి నాగేశ్వరరావు, శేష బాబ్జి, జిల్లా నాయకులు ఎం రాజశేఖర్, కార్యకర్తలు రమణి, రమణ, మాధురి పాల్గొన్నారు.

అరకు సిపిఎం ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని...

సీలేరు : ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం అరకు పార్లమెంట్ అభ్యర్థి పాసిపెంట అప్పలనర్సను గెలిపించాలని కోరుతూ జీకే వీధి మండలం జర్రెల పంచాయతీలో గురువారం ప్రచారం నిర్వహించారు. సిపిఎం మండల నాయకులు అంపరంగి శాంతి ఆధ్వర్యాన ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. చట్టసభల్లో ఆదివాసీల వాణిని వినిపించే దమ్మున్న నాయకుడిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

సిపిఎం అభ్యర్థుల గెలుపుతోనే అభివృద్ధి

డుంబ్రిగుడ: సిపిఎం అరకు పార్లమెంట్ అభ్యర్థి పి.అప్పలనర్సకు ఓటు వేసి గెలిపించాలని మండలంలోని కితలంగి పంచాయతీ పాములపుట్టు, గాంద గ్రామంలో గురువారం ఆ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ, పాములపుట్టు గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మాణం చేపట్టిన రోడ్డు పనులు పూర్తి చేయాలని, పరిశీల నుంచి పాములపుట్టు గ్రామానికి మధ్య కల్వర్టు నిర్మాణం చేపట్టకపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని చెప్పారు. గాంధ గ్రామంలో మంచినీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గిరిజన ప్రాంతం సమగ్ర అభివృద్ధి చెందాలంటే సిపిఎం ఎంపీ అభ్యర్థి పి అప్పలనర్సను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతురాజు, మాజీ సర్పంచ్ పి.సురేష్ కుమార్, ఆ పార్టీ మండల నాయకులు టి.సూర్యనారాయణ, పి.సత్యనారాయణ, నాయకులు మహేష్, నూకరాజు, సీతారాం, మోహన్ రాజు, రాజుబాబు, లైకోన్ తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండలం లోని తాడిపుట్టు పంచాయితీ మధన పురం, భీమవరం పంచాయితీ గుమ్మడి గండువ గ్రామాల్లో సిపిఎం నేతలు ప్రచారం చేపట్టారు. వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, సీపీఎం మండల నాయకులు తాపుల కృష్ణారావు మాట్లాడుతూ, సీపీఎం ఎంపీ అభ్యర్థి అప్పలనర్సను గెలిపిస్తే తారు రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో మజ్జి మహేష్, బాలకృష్ణ, రాంబాబు, బాలయ్య, పాంగి జోసెఫ్, మజ్జి అరుణ, జానకమ్మ, రూతు, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు : మండలంలోని ఈదులపుట్టు, మంగ బంధ, చుట్టుమట్ట గ్రామాల్లో అప్పలనర్సను గెలిపించాలని ఇంటింటా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బొండా సన్నిబాబు, కిల్లో శర్భన్న, రామన్న, రామారావు తదితరులు పాల్గొన్నారు .

జి.మాడుగుల: మండలంలోని సోలభం పంచాయితీ గెమ్మిలి, చెరువు బంధంలో సిపిఎం నేతలు ప్రచారం చేపట్టారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్న పడాల్, ఉపాధ్యక్షులు కోర్ర శర్బు మాట్లాడుతూ, సిపిఎం ఎంపీ అభ్యర్థి పి అప్పలనర్స, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిని శతక బుల్లి బాబును గెలిపిస్తే జీవో 3 చట్టబద్ధత కోసం పోరాడతారన్నారు. ఈ కార్యక్రమంలో సిదేరి చినమ్మి, పాంగి గణేష్, గ్రామస్తులు. నర్సింగరావు,.కోర్ర సత్తిబాబు, పాంగి సన్యాసిరావు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: మండలంలోని బస్కి పంచాయితీ బరెంగిబంధ, కంజరితోట, కొర్రాగూడ, కొంత్రాయిగుడ, బిజ్జగుడ, హుకుంపేట మండలం బూర్జ, తుమ్మవలస గ్రామాల్లో సిపిఎం నాయకులు ప్రచారం చేపట్టారు.ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కె.రామారావు మాట్లాడుతూ, అప్పలనర్సను గెలిపిస్తేనే గిరిజన హక్కులు, చట్టాల కోసం పోరాటం చేస్తారన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ కొండలరావు, సుబ్బారావు, బాబురావు, జగన్ పాల్గొన్నారు.

అరకు మండలంలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: నర్సీపట్నం మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి 10వ వార్డుకు చెందిన వైసీపీ ముఖ్య నాయకులు సబ్బవరపు అప్పలనాయుడు గురువారం టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎన్డీఏ ఉమ్మడి అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆయనకు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు.

నక్కపల్లి : తెలుగుదేశం పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని పాయకరావుపేట నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని ఉపమాక పంచాయతీ శివారు సారిపల్లివానిపాలెం గ్రామానికి చెందిన పలువురు టిడిపిలో చేరారు. ఈ మేరకు గురువారం నక్కపల్లి క్రిష్ టౌన్ షిప్‌లో ఆమె స్వగృహంలో పార్టీలో చేరిన వారికి అనిత చేతుల మీదుగా కండువాలు వేసి సాధారణంగా పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన 40 కుటుంబాలు వైసీపీని వీడి టిడిపిలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, నాయకులు కొప్పిశెట్టి కొండబాబు, కొప్పిశెట్టి బుజ్జి, వాసు పాల్గొన్నారు.

ప్రకటనలు, పెయిడ్ ఆర్టికల్స్‌పై నిఘా

-వ్యయ పరిశీలకులు పంకజ్ సింగ్

ప్రజాశక్తి-పాడేరు: ఎన్నికలకు సంబంధించి పోటీలో ఉన్న అభ్యర్థులు, పార్టీలకు సంబంధించిన ప్రకటనలు, పెయిడ్ ఆర్టికల్స్ పట్ల అప్రమత్తంగా ఉండి, నిరంతర నిఘా వేయాలని వ్యయ పరిశీలకులు పంకజ్ సింగ్ ఆదేశించారు. గురువారం వ్యయ పరిశీలకులు, జిల్లా కమాండ్ కంట్రోల్ రూమ్ లోని వివిధ ఎన్నికల విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దినపత్రికలు, వివిధ చానళ్లను నిరంతరం పరిశీలించి ప్రకటనలు, పెయిడ్ ఆర్టికల్స్‌పై వ్యయ అధికారులకు అకౌంటింగ్ బృందాలకు నివేదికలు అందించాలని సూచించారు. ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి బృందాలు క్షేత్ర స్థాయిలో నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలక్టర్ ఎం. విజయ సునీత, డిఆర్ఒ బి.పద్మావతి, వివిధ విభాగాల నోడల్ అధికారులు పి.గోవింద రాజులు, సాయి నవీన్, శివయ్య, రమేష్ కుమార్ రావు, వెంకటరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి- పద్మనాభం, భీమునిపట్నం: పద్మనాభం 33/11కెవి సబ్‌స్టేషన్, 11 కెవి రేవిడి ఫీడర్ నిర్వహణ, చెట్ల నరికివేత, లైన్ మరమ్మత్తుల నిమిత్తం శుక్రవారం మండలంలోని ఆరు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జోన్-3 ఇఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని రేవిడి, బర్లపేట, పాండ్రంగి, కొండ బర్లపేట, కూరపల్లి, పాండ్రంగి గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

భీమునిపట్నం : మండలంలోని చిప్పాడ 33/11కె వి విద్యుత్ సబ్ స్టేషన్ నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయ నున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని అన్నవరం, మూలకుద్దు, పెదనాగమయ్యపాలెం, అమనాం, చిప్పాడ, గుడివాడ పంచాయతీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యాన ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఉచిత కంప్యూటర్ శిక్షణా తరగతులను గురువారం ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టెన్త్ పాసైన 50 మంది పేద విద్యార్థినులకు 8వ బ్యాచ్ ఉచిత కంప్యూటర్ శిక్షణా తరగతులు ప్రారంభించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 500 మంది శిక్షణ పొంది పలు సంస్థల్లో ఉపాధి పొందుతున్నారని వివరించారు. ఆసక్తి గల విద్యార్థినులు 9643222666 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆరో వార్డులో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి -పిఎం పాలెం : జివిఎంసి ఆరో వార్డు పరిధి పిఎం.పాలెంలో విశాఖ పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షులు గరే గురునాథ్ ఆధ్వర్యాన గురువారం టిడిపి గెలుపు కోరుతూ ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావును, ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు బిసిసెల్ అధ్యక్షులు రెడ్డి సత్యనారాయణ, కొల్లి గోవిందరావు, కొప్పాక రామకృష్ణ, కొల్లి బాబ్జిదాసు, గారపాటి శివకుమార్, పవన్, సంతోషి, లక్ష్మి, పద్మ, రక్మి పాల్గొన్నారు.

వీధి కుక్క స్వైర విహారం : 8 మందికి గాయాలు

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని పాండ్రంగి గ్రామంలో వీధి కుక్క స్వైర విహారం చేసి 8 మందిని గాయపరిచింది. పి.కుమారి, రమణమ్మ, శ్రీను, బ్రహ్మం, హర్ష, సీతమ్మ, కుమార్ తదితరులను వీధి కుక్క కరవడంతో పలువురికి తీవ్ర గాయాలు, మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. కుక్క కాటుకు గురైన వారందరినీ 108లో విజయనగరం మహారాజ ఆసుపత్రికి వైద్య చికిత్స నిమిత్తం తరలించారు.

వేసవి సెలవులు పక్కాగా అమలుచేయాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ జిల్లాలోని అన్ని యాజమాన్యాల స్కూళ్లు, ఇంటర్మీడియట్ కళాశాలల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకు వేసవి సెలవులు పక్కాగా అమలు చేయడంలో జిల్లాల ఉన్నతాధికారులు శత శాతం చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసినట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి పదో తరగతి విద్యార్థులకు, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో అడుగిడుతున్న విద్యార్థులకు కళాశాలల్లో యథేచ్ఛగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు కమిషన్‌కు ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలు



మాట్లాడుతున్న తహశీల్దార్ నాగమణి

ప్రజాశక్తి- అడ్డతీగల : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలు ఏర్పాటు చేయాలని మండల తహశీల్దార్ నాగమణి ఆదేశించారు. పోలింగ్ రోజు క్యూ లైన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే సెక్టార్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లు, బూత్ లెవెల్ అధికారులతో గురువారం తహశీల్దారు సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పాండురంగారావు, ఎంఇఒ శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ దుర్గార్తి, లతాశ్రీ, అడ్డతీగల ఎస్పై అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి వెండి విగ్రహం వితరణ

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరు ఆంజనేయస్వామి దేవాలయానికి దారకొండ పంచాయతీ ఏనుగుబయలు గ్రామానికి చెందిన సేవాకుల చంద్రశేఖర్ దంపతులు రెండు కేజీలు వెండి ఆంజనేయ స్వామి విగ్రహాన్ని సమర్పించారు. విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయంలో ప్రతిష్ఠించారు. చంద్రశేఖర్ దంపతులను ఆలయ కమిటీ నిర్వాహకులు వై.ధర్మరాజు, వరప్రసాద్, ఆర్ఎన్.రామకృష్ణ దుస్సాలువాలతో సత్కరించారు.

ఎన్నికల నిర్వహణలో అప్రమత్తత

పరిశీలకులు అమిత్‌శర్మ, అమిత్ కుమార్

నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అధికారులకు హితవు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో అధికారులందరూ అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కృషి చేయాలని జిల్లా అధికారులను విశాఖపట్నం లోక్‌సభ నియోజకవర్గ సాధారణ పరిశీలకులు అమిత్ శర్మ, పోలీసు పరిశీలకులు అమిత్ కుమార్ ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ సాహసంతో కూడుకున్నదని జాగురూకత వహిస్తూ ముందుకు సాగాలని, ఎన్నికల కమిషన్ నిబంధనలను విధిగా పాటించాలని, రూల్‌బుక్‌ను ఫాలో అవుతూ సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టరేట్ మీటింగ్ హాలులో గురువారం సాయంత్రం జిల్లా అధికారులతో వారిద్దరూ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారిద్దరూ పలు అంశాలపై మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఉత్సాహంగా పని చేయాలని చెప్పారు. సునిశిత పరిశీలన ఉండాలని హితవు పలికారు. సున్నితమైన అంశాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులందరూ క్రమశిక్షణతో మెలగాలని, అందరిపట్లా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని హితవు పలికారు. అనుమతుల జారీలో, సమయం కేటాయింపులో అందరి పట్లా ఒకే విధానం అనుసరించాలని సూచించారు. ఘర్షణలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, సమన్వయంతో ముందుకు సాగాలని తెలిపారు. పోలింగ్ జరిగేలోపు జిల్లాలోని అన్ని కేంద్రాలను, చెక్ పోస్టులను సందర్శిస్తామని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు చేపట్టిన చర్యలను వివరించారు. ఎన్నికల కోడ్ అమల్లో అప్రమత్తంగా ఉంటున్నామని, నిబంధనలు అతిక్రమించిన ఘటనల్లో కఠినంగా వ్యవహరిస్తున్నామని, ఇప్పటి వరకు పలు ఘటనల్లో క్రమశిక్షణ చర్యలు తీసుకున్నామని పరిశీలకులకు వివరించారు. జిల్లా వ్యాప్తంగా 110 రకాల బృందాల అధికారులతో ప్రవర్తనా నియమావళి అమలును నిరంతరం పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో ఎంసిసి నోడల్ అధికారి సిఎం.సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఎడిసి కెఎస్.విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ పాల్గొన్నారు.

జెఇఇ మెయిన్స్‌లో అదరగొట్టారు

- **98.5 పర్సంటైల్‌తో బుచ్చయ్యపేట విద్యార్థి హర్షవర్ధన్, 86.42 పర్సెంటైల్‌తో గిరిజన విద్యార్థి కుశబాబు ప్రతిభ**
- **రాణించిన మారికవలస ఎపి గిరిజన సంక్షేమ గురుకుల శిక్షణ సంస్థ విద్యార్థులు**

జెఇఇ మెయిన్స్ - 2024 పరీక్షా ఫలితాల్లో ఉమ్మడి విశాఖ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ముఖ్యంగా గిరిజన విద్యార్థులు ఈ పరీక్షల్లో సత్తా చాటారు. వారికి పలువురు అభినందనలు తెలిపారు.

(ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం)

వంతల కుశబాబు

మధురవాడ : మారికవలసలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల శిక్షణ సంస్థలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు ఐఐటి జెఇఇ మెయిన్స్ -2024లో విజయదుందుబి మోగించారు. వారికి శిక్షణ సంస్థ ప్రిన్సిపల్ శివప్రసాద్ అభినందనలు తెలిపారు. 29 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ముంచంగిపుట్టు మండలంలోని పెద్దతమ్మింగల గ్రామానికి చెందిన వంతల కుశబాబు 86.42 పర్సెంటైల్‌ను సాధించాడు. కుశబాబు తండ్రి డుంబు బీద వ్యవసాయ కూలి. పేదింటి నుంచి వచ్చిన కుశబాబు ఉత్తమ ప్రతిభ కనబరచడంతో అందరూ ఆయన్ని అభినందిస్తున్నారు. కుశబాబు స్పేస్ ఇంజినీర్ కావాలన్న లక్ష్యంతో పట్టుదలతో చదివి విజయం సాధించాడు. 80కి పైబడి ఒకరు, 70కి పైబడి ఇద్దరు, 60కి పైబడి నలుగురు పర్సంటైల్ సాధించారు. పరీక్షకు హాజరైన వారిలో 11 మంది విద్యార్థులు ఐఐటి అడ్వాన్స్‌కు క్వాలిఫై అవ్వడం చాలా సంతోషదాయకంగా ఉందని శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ ఎల్.శివప్రసాద్, సిబ్బంది చెప్పుకొచ్చారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాడేరు ఐటిడిఎ పిఒ వి.అభిషేక్, డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు అభినందనలు తెలిపారు.

వి.హర్షవర్ధన్

బుచ్చయ్యపేట : మండలంలోని రాజాంకు చెందిన వుమ్మడవరపు హర్షవర్ధన్ జెఇఇ మెయిన్స్ పరీక్షా ఫలితాల్లో 98.5 పర్సంటైల్‌తో అడ్వాన్స్‌డ్ పరీక్షలకు అర్హత సాధించాడు. హర్షవర్ధన్‌కు ఇంటర్మీడియట్ పరీక్షల్లో 980 మార్కులు వచ్చాయి. జాతీయ స్థాయి ప్రతిష్టాత్మకమైన ఎన్ఐటిలో ఇంజినీరింగ్ బిటెక్ సీట్ సాధించేందుకు నిర్వహించిన జెఇఇ మెయిన్స్ పరీక్షలలో హర్షవర్ధన్ సత్తా చాటడంతో తల్లిదండ్రుల రమేష్, లక్ష్మి సంతోషం వ్యక్తం చేశారు.

సత్తా చాటిన శశి విద్యార్థులు

తగరపువలస : జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో తమ విద్యా సంస్థకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు స్థానిక సంగివలస శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. జి.జైదీప్ 99.44 పర్సంటైల్‌తో ఆలిండియా 33వ ర్యాంకు, ఎస్.దిలీప్ వెంకట సతీష్ 99.94 పర్సంటైల్‌తో ఆలిండియాలో 126వ ర్యాంకు, జి.దుర్గా ప్రసాద్ 99.85 పర్సంటైల్‌తో ఆలిండియాలో 435వ ర్యాంకు, సిహెచ్.వరుణ్ నాగ సాయి నారాయణ 99.75 పర్సంటైల్‌తో ఆలిండియాలో 810వ ర్యాంకు, సిహెచ్.శ్యామ్ సుందర్ 99.62 పర్సంటైల్‌తో 829వ ర్యాంకు, ఎస్.అనిల్ వర్మ 99.62 పర్సంటైల్‌తో ఆలిండియాలో 859వ ర్యాంకు సాధించినట్లు వెల్లడించారు. 99 పర్సంటైల్‌పైన 19 మంది, 98 పర్సంటైల్‌పైన 37 మంది, 97పైన 54 మంది, 96పైన 61 మంది, 95పైన 69 మంది 94పైన 86 మంది, 93పైన 96 మంది, 92పైన 103 మంది, 91పైన 112 మంది, 90 పర్సంటైల్‌పైన 123 మంది ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. ఫలితాలు సాధించిన వారికి శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మేకా క్రాంతి సుధ అభినందనలు తెలిపారు

ఆకాష్ విద్యార్థులు రాణింపు

సీతమ్మధార : ఆకాష్ సంస్థకు చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి 100 శాతం పర్సంటైల్ సాధించి టాప్ ర్యాంకర్లుగా నిలిచారు. జాతీయ స్థాయిలో (ఉమెన్ క్యాటగిరీ) టాప్ ర్యాంక్ 1 సాన్వి జైన్ సాధించి ఆకాష్ ప్రతిష్టను ఉన్నత స్థితిలో నిలిపింది. ఈ సందర్భంగా విశాఖకు చెందిన ఐదుగురు విద్యార్థులు 99కి పైగా పర్సంటైల్ సాధించారు. ఈ మేరకు గురువారం అక్కయ్యపాలెంలోగల ఆకాష్ విద్యాసంస్థల కార్యాలయంలో విజేతలను ఘనంగా సత్కరించారు. 99.89 పర్సంటైల్ సాధించిన సిద్ధార్థ పటేల్, 99.63తో జె.సాయి హర్షిత్, 99.5తో ఎం.లక్ష్మి శృతిక, 99.4తో సోమా మిశ్రా, 99.37తో వెంకట యషీక్ బోనగిరి ఉత్తమ ర్యాంకర్లుగా నిలిచారు. వీరితోపాటు అర్జున్ హరి, తనుశ్రీ, సందీప్ కుమార్ వియ్యపు, చైతన్య ఎర్రంరెడ్డి కూడా 98కిపైగా పర్సంటేజ్ సాధించారు. వారిని సంస్థ డిప్యూటీ డైరెక్టర్ ఆర్‌విఎస్ నారాయణమూర్తి అభినందించారు.

గురువారం విద్యాసంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్లు వై.లక్ష్మీనారాయణ, అత్తిలి ఈశ్వర్ ప్రసాద్, బ్రాంచి హెడ్ రాజేష్, నిరంజన్ పండా, అకడమిక్ హెడ్స్ సాయికిరణ్, అప్పారావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఆల్ ఇండియా ఉమెన్ క్యాటగిరీలో ఒకటో ర్యాంక్‌తో పాటు సాయి దివ్య తేజ రెడ్డి 15వ ర్యాంకు, రిసీ సుక్ల 19వ ర్యాంకు సాధించి 50లోపు ర్యాంకులలో తాము మూడు ర్యాంకులను కైవసం చేసుకున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. వందలోపు ఎనిమిది ర్యాంకులు, 500లోపు 36 ర్యాంకులు, వెయ్యిలోపు 62 ర్యాంకులను సొంతం చేసుకున్నట్లు వెల్లడించారు.

విజయ సంకేతం చూపుతున్న ఆకాష్ విద్యార్థులు, యాజమాన్యం

రైల్వే స్టేషన్లలో ‘ఎకానమీ మీల్స్’

రూ.20కే అందించేందుకు ఐఆర్‌సిటిసి ఏర్పాట్లు

రూ.50కే స్నాక్ మీల్ : డిఆర్ఎం సౌరభ్ ప్రసాద్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : రైలు ప్రయాణీకులకు నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనాన్ని అందించడానికి, భారతీయ రైల్వే, ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సిటిసి)తో కలిసి ‘ఎకానమీ మీల్స్’ను ప్రవేశపెట్టాయి. వేసవిలో ప్రయాణీకుల రద్దీని దష్టిలో ఉంచుకుని, ప్రత్యేకించి సాధారణ కోచ్‌లలో ప్రయాణించే వారికి, సరసమైన ధరతో రెండు రకాల భోజనం అందించనున్నారు. ఈ ఎకానమీ మీల్స్ ధర రూ. 20, స్నాక్ మీల్స్ ధర రూ.50.గా నిర్ణయించి, అందించనున్నారు. ఈ భోజన కౌంటర్లు ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్‌లో, విశాఖపట్నం, విజయనగరం శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్‌లతో పాటు అన్ని ప్రధాన స్టేషన్‌లలో అందుబాటులో ఉంచనున్నారు.

ఈ సందర్భంగా డివిజనల్ రైల్వే మేనేజర్ సురభ్ ప్రసాద్ మాట్లాడుతూ ప్లాట్‌ఫారమ్‌లపై సాధారణ సెకండ్ క్లాస్ (జిఎస్) కోచ్‌ల దగ్గర సౌకర్యవంతంగా ఉండే కౌంటర్లలో ఈ భోజనాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రయాణీకుల ఆహార అవసరాలను తీర్చడంతోపాటు, వారి ప్రయాణ సమయంలో సౌలభ్యం కలిగించడమే లక్ష్యంగా దీనిని ప్రవేశపెట్టమన్నారు. అంతేకాకుండా ఈ వేసవిలో స్వచ్ఛంద సంస్థల సహకారంతో పలు స్టేషన్లలో తాగునీరు, మజ్జిగ, పాలు అందించడానికి వాల్తేరు రైల్వేడివిజన్ సన్నాహాలు చేస్తోందన్నారు.

రియల్‌మీ నార్జో 5జి ఆవిష్కరణ

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: రియల్‌మీ నూతన ఆవిష్కరణ, నార్జో 70 5జి సిరీస్ మొబైల్ ఫోనును గురువారం నగరంలోని ఒక హోటల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి మాట్లాడుతూ,నూతన టెక్నాలజీతో రియల్‌మీ నార్జో ప్రీమియం ఫీచర్స్‌ను 5జి వినియోగదారులకు అందిస్తోందన్నారు. భవిష్యత్తు స్మార్ట్ ఫోన్ల డిజైన్‌కు తగ్గట్టుగా త్వరగా ఛార్జయ్యే పెద్ద బ్యాటరీతో,ఎక్కువ కాలం బ్యాటరీని అందిస్తుందన్నారు. కేవలం 188 గ్రాముల తేలికైన బరువున్న ఈఫోన్లు ప్రారంభధర రూ.10,999 నుంచి ఉందన్నారు.

ఐదేళ్లు..ఐదు అంశాలతో ‘విజన్ విశాఖ’

వైసిపి ప్రచార కరపత్రాలను ఆవిష్కరించిన బొత్స

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : విశాఖను ప్రపంచపటంలో అత్యుత్తమంగా నిలిపేందుకు ఐదేళ్ళ,ఐదు అంశాల్లో అభివృద్ధి చేయాలన్నదే వైసిపి లక్ష్యమని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. గురువారం లాసన్స్‌బే కాలనీ పార్లమెంట్ ఎన్నికల కార్యాలయంలో మంత్రి బొత్సతోపాటు ఎంపీ అభ్యర్థి ఝాన్సీ‘విజన్ విశాఖ’ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ప్రచారంలో ఇంటింటికీ వెళ్లి వీటిని ప్రజలకు పంచిపెట్టి వివరించాలన్నారు.

ఈ సందర్భంగా మంత్రి బొత్స మాట్లాడుతూ, విశాఖ సమగ్రాభివృద్ధికి అనుసంధానత, పారిశ్రామిక కారిడార్, సమగ్ర పట్టణ ప్రణాళికతో మౌలిక సౌకర్యాలు కల్పన, ప్రామాణిక జీవనానికి దీటైన సామాజిక సదుపాయాలు, స్థిరాభివృద్ధికి అనుగుణమైన వాతావరణ సృష్టి వంటి అంశాలు పొందుపరిచినట్లు తెలిపారు. తాజా ఎన్నికల్లో వైసిపి ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మితోపాటు ఇతర ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర ప్రధానకార్యదర్శి రవిరెడ్డి, కార్యదర్శి జివి.కృష్ణారావు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కృప జ్యోతి పాల్గొన్నారు.